

అంగన్‌వాడీల్లో బయోమెట్రిక్!

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బయోమెట్రిక్ హాజరు ప్రవేశపెట్టనుంది.

- 8లో ▸



'బైపాస్'తో అలజడి

ఎన్‌హెచ్ 63 విస్తరణలో భాగంగా బైపాస్ రోడ్డు వేయనుండటంతో భూములు కోల్పోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0 /24.9

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాత్రి 12 గంటల వరకు దుకాణాలకు అనుమతి

ఖలీల్‌వాడి: పండుగల నేపథ్యంలో జిల్లాలో రాత్రి వేళ దుకాణాలు తెరిచి ఉంచేందుకు అనుమతి ఇస్తున్నట్లు సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. మహా శివరాత్రి, గుడ్ ఫ్రైడే, రంజాన్, ఉగాది, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి పండుగలను పురస్కరించుకొని ప్రజల సౌలభ్యం కోసం వ్యాపార సముదాయలకు రాత్రి 12 గంటలకు మినహాయింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ చివరి వరకు ఈ మినహాయింపులు అమలులో ఉంటాయని తెలిపారు.

వాగులకు నీరు వదలకపోతే ప్రత్యక్ష పోరాటం



వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గంలో ప్రవహించే కప్పలవాగు, పెద్దవాగుకు 21 ప్యాకేజీ ఔట్‌లెట్ ద్వారా రెండ్రోజుల్లో నీళ్ల వదలాలని, లేకుంటే రైతులతో కలిసి ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన జిల్లా ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వాగు పరివాహక రైతుల కోరిక మేరకు 20 రోజుల కిందట ఇరిగేషన్ సీఈతో ఫోన్‌లో మాట్లాడి నీళ్ల వదలాలని తన లెటర్ ద్వారా విన్నవించానన్నారు. నీటి విడుదలపై ప్రభుత్వానికి విన్నవించాం కానీ, ఇంకా ఏ నిర్ణయం ప్రభుత్వం తీసుకోలేదని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. నీళ్ల వదలకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నా రు. బాబ్లీ నుంచి శ్రీరాంసాగర్‌కు నీళ్ల వదిలినందున మొదటి విడతగా రోజుకు 300 క్యూసెక్కుల చొప్పున 10 రోజుల పాటు 0.5 టీఎంసీల నీరు వదలాలని డిమాండ్ చేశారు.

నేడు తెరుచుకోనున్న మాధవనగర్ రైల్వేగేట్!

నిజామాబాద్ రూరల్: నెల పదిహేను రోజులుగా మూసి ఉన్న మాధవనగర్ రైల్వే గేట్ సోమవారం తెరుచుకోనున్నట్లు సమాచారం. ఆర్వోబీ పనుల నేపథ్యంలో రైల్వే గేట్ మూసి వేశారు. దీంతో వాహనదారులు బైపాస్‌రోడ్డు, అండర్ పాస్ నుంచి రాకపోకలు సాగించారు. పిల్లర్ల పనులు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తవడంతో నేడు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

కబ్జాలకు పాల్పడుతున్న ఏడుగురిపై కేసు

కామారెడ్డి క్రైం: ప్లాట్లు కబ్జా చేయడమే కాకుండా బెదిరింపులు, దాడులకు పాల్పడిన ఘటనలో ఏడుగురిపై కేసు నమోదయ్యింది. ఈ కేసులో నలుగురిని ఆదివారం రిమాండ్‌కు తరలించారు. కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు తెలిపిన వివరాలు.. అశోక్‌నగర్ కాలనీలో నివసించే కూచాని బస్వయ్య అనే వ్యక్తి 1985లో దేవునిపల్లి శివారులో ఉన్న కాకతీయనగర్ కాలనీలో ఉరుదొండ నర్సయ్య నుంచి నాలుగు ఓపెన్ ప్లాట్లను కొనుగోలు చేశాడు. నర్సయ్య మరణానంతరం ఆయన కుమారుడు ఉరుదొండ రాజయ్య ప్లాట్ సరిహద్దులను మారుస్తూ తప్పుడు దస్తావేజులను సృష్టించారు. రాజయ్యతో పాటు అతడి కుమారులు రవి, నరేష్ కుమార్, ప్రవీణ్ కలిసి రూ.10 లక్షలు ఇవ్వాలని, లేకపోతే సదరు ప్లాట్ మీదుగా తమ మిగిలిన స్థలాలకు రోడ్డు వేస్తామని బస్వయ్యను బెదిరించారు. అక్టోబర్ 6న రాజయ్య, ఆయన కుమారులు ఉరుదొండ రవి, నరేష్ కుమార్, ప్రవీణ్‌తోపాటు 35 వార్డు కౌన్సిలర్ పోలీస్ కృష్ణాజీరావు, నరేందర్‌రావు, స్వామి ప్లాట్ యజమానిని బెదిరించడంతో పాటు సిమెంటు ప్లేట్లను, స్తంభాలను పగలగొట్టారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు గొల్ల స్వామి, నరేష్ కుమార్, ప్రవీణ్, కృష్ణాజీరావులను ఆదివారం రిమాండ్‌కు తరలించారు.

బీజేపీ మండలాధ్యక్షుల నియామకం

కామారెడ్డి క్రైం: బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలో బీజేపీ మండల అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాన్సువాడ టౌన్ అధ్యక్షుడిగా శివప్రసాద్, మండల అధ్యక్షుడిగా దత్తాపురం సాయిబాబా, బీర్కూర్‌కు నాగెల్ల సాయికిరణ్, వర్ని మండలానికి ఎల్లం శంకర్, నస్రుల్లాబాద్‌కు సున్నం సాయిలు, కోటగిరికి ఏముల నవీన్, పోతంగల్‌కు ప్రకాష్ పటేల్, రుద్రూర్‌కు హరికృష్ణ, చందూర్‌కు మదిశెట్టి విఠల్, మోస్రా మండలాధ్యక్షుడిగా సంగ అనిల్ నియమితులయ్యారు. జుక్కల్ మండలాధ్యక్షుడిగా శివాజీ రావు పటేల్, నిజాంసాగర్‌కు మేకల నరేష్, పిట్లంకు అభినయ్‌రెడ్డి, పెద్దకొడప్‌గల్‌కు బాలాజీ పటేల్‌ను నియమించినట్లు అరుణతార తెలిపారు.



కార్నల్ తండాలో పొలంలో మేస్తున్న పశువులు

అడుగంటుతున్న ఆశలు




ధర్పల్లి మండలం కార్నల్‌తండాకు చెందిన శంకర్‌నాయక్ యాసంగిలో మూడు ఎకరాల్లో వరి సాగు చేశాడు. పంట పొట్ట దశకు వచ్చాక బోరు ఎత్తిపోయింది. దీంతో రూ.1.60 లక్ష వెచ్చించి 770 అడుగుల లోతు బోరు తవ్వించాడు. కొద్దిపాటి నీరు బయటకు రాగా పంటకు సరిపోతాయనే ఆశతో రూ.1.10 లక్ష వెచ్చించి కొత్త మోటార్, కేబుల్ బిగించాడు. కానీ ఆ రైతు ఆశలు ఒక రోజులోనే ఆవిరి అయిపోయాయి. కొత్తగా తవ్వించిన బోరు నుంచి నీరు రాకపోవడంతో పంట పూర్తిగా ఎండిపోతుంది. దీంతో చేసేది ఏమీ లేక పంటలో పశువులను మేపుతున్నాడు.



ధర్పల్లి మండలం హొన్నాజీపేట గ్రామానికి చెందిన కుర్మ బీరయ్య రెండు బోర్లతో మూడెకరాల్లో వరి సాగు చేశాడు. పంట పొట్ట దశలో రెండు బోర్లు పోయడం లేదు. దీంతో నాలుగు రోజుల క్రితం 400 ఫీట్ల లోతులో మూడు బోరు తవ్వించినా నీరు రాలేదు. దీంతో పంటపై ఆశలు వదులుకున్నాడు.

- జిల్లాలో పడిపోయిన భూగర్భజలాలు
- నీరందక ఎండిపోతున్న పంటలు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

ధర్పల్లి: ఎన్నో ఆశలతో యాసంగిలో సాగు చేసిన వరి పొలాలు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో పొట్ట దశకు వచ్చిన వరి పొలాలు నెర్రలు బారుతున్నాయి. ఎండిన పొలాలు చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్తగా బోర్లు తవ్వించినా చుక్క నీరు పడకపోవడంతో పంట పొలాల్లో పశువులు మేపుతున్నారు.. జిల్లాలో వానాకాలంలో భారీ వర్షాలు పడడంతో కుంటలు, చెరువులు నిండాయి. భూగర్భ జలాలు సమృద్ధిగా పెరిగి బోర్లు బాగా పోశాయి. దీంతో పంటలు పండుతాయనే నమ్మకంతో యాసంగిలో కూడా రైతులు ఎక్కువగా వరినే సాగు చేశారు. కానీ ఎండలు ముదరకముందే చెరువులు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. రోజురోజుకు నీటి నిల్వలు పడిపోతున్నాయి. దీంతో బోర్లను నమ్ముకొని వరి వేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మరో నాలుగు తడుల్లో పంట చేతికొచ్చే తరుణంలో బోర్లు వట్టిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంటలను కాపాడుకోవడానికి అనేక అవస్థలు పడుతున్నారు. చేతికొచ్చిన పంటను వదులుకోలేక అప్పులు చేసి కొత్తగా బోర్లు వేయిస్తున్నారు. అయినా నీరు పడటంలేదని వాపోతున్నారు. దీంతో ఎండిన పంటలో పశువులను మేపుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



నీరు అందక ఎండిపోయిన పొలం



హొన్నాజీపేటలో పొలంలో బోరు వేస్తున్న దృశ్యం

ప్రభుత్వం ఆదుకోవాలి



ఎన్నో ఆశలతో సాగు చేసిన పొలం కళ్లముందే ఎండిపోతుంటే బాధగా ఉంది. పంటలను కాపాడుకునేలా ప్రభుత్వం అండగా నిలవాలి. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టినప్పటికీ సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. బోర్లు, మోటార్ల కోసం ప్రభుత్వాలు సబ్సిడీ ఇస్తే మాపై కాస్త భారం తగ్గుతుంది.

– తిరుపతి, రైతు, కర్నల్ తండా

'డీసీసీబీ'పై హస్తం గురి!

- అవిశ్వాసానికి 16మంది అనుకూలం!
- వారం రోజులుగా క్యాంపు రాజకీయాలు

సుభాష్‌నగర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (ఎన్‌డీసీసీబీ) చైర్మన్ పీఠంపై హస్తం పార్టీ గురి పెట్టింది. ఆ దిశగా ఇప్పటికే అధికార కాంగ్రెస్ కసరత్తు మొదలుపెట్టింది. వైస్ చైర్మన్ సహా 14 మంది బ్యాంకు డైరెక్టర్లతో క్యాంపు రాజకీయాలు నడిపిస్తోంది. మరో ఇద్దరు కూడా నేడో, రేపో క్యాంపులో చేరిపోనున్నారు. వారందరి సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మాన లేఖను సోమవారం హైదరాబాద్‌లోని కమిషనర్‌కు అందజేయనున్నట్లు తెలిసింది. మున్ముందు ఎన్‌డీసీసీబీ రాజకీయాలు ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

ఎన్‌డీసీసీబీ బ్యాంకు పాలకవర్గం 2020 ఫిబ్రవరిలో ఏర్పడింది. 20 మంది సభ్యులు (ఓటు హక్కు కలిగినవారు), కో ఆప్షన్, సీఈవో, డీసీవో కలిసి మొత్తం 23 మంది ఉన్నారు. పాలకవర్గ గడువు నాలుగేళ్లు పూర్తి కావస్తోంది. ప్రస్తుత చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు కావడంతో ఆ పీఠంపై కాంగ్రెస్ గురి పెట్టింది. మెజార్టీ డైరెక్టర్లు బీఆర్ఎస్‌లోనే ఉన్నప్పటికీ.. చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని హస్తం పెద్దలు యోచిస్తున్నారు. గతంలో చైర్మన్ పదవిని ఆశించిన ఓ డైరెక్టర్‌కు పీఠం కట్టబెట్టే దిశగా పావులు కదుపుతున్నారు. ఈ మేరకు డైరెక్టర్లతో క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. సుమారు 14 మంది డైరెక్టర్లను క్యాంపునకు తరలించినట్లు తెలిసింది.



నేడు కమిషనర్‌కు అవిశ్వాసం నోటీసు!

డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిపై 16 మంది డైరెక్టర్ల సంతకాలతో అవిశ్వాస తీర్మానం లేఖను హైదరాబాద్‌లోని కమిషనర్‌కు సోమవారం అందజేయనున్నట్లు తెలిసింది. వీలైనంత త్వరగా చైర్మన్ పీఠం దక్కించుకునేందుకు కాంగ్రెస్ యత్నిస్తోంది. అవిశ్వాసం విషయాన్ని ఇదివరకే సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డిని బ్యాంకు డైరెక్టర్లు కలిసేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆయన సమక్షంలోనే పార్టీలో చేరేలా కాంగ్రెస్ పెద్దలు ప్రణాళికలు చేస్తున్నారు.

ఎట్టకేలకు దివ్యాంగులకు రుణాలు

- సబ్సిడీ లోన్లకు నిధులు విడుదల చేసిన ప్రభుత్వం

మోర్తాడ్(బాల్కొండ): దివ్యాంగులకు స్వయం ఉపాధి కోసం ప్రతి ఏటా అందించే రాయితీ రుణాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన నిధులు ఇప్పుడు విడుదల అయ్యాయి. దీంతో రాయితీ రుణాలను దివ్యాంగులకు అందించడానికి వికలాంగుల సంక్షేమ శాఖ చర్యలు తీసుకుంటుంది. 2023–24 ఆర్థిక సంవత్సరం ముగిసిపోతుండగా ఈ ఏడాదికి సంబంధించిన లబ్ధిదారులను కొత్తగా ఎంపిక చేసే అవకాశం కనిపించడం లేదు. 2023 మార్చిలో దివ్యాంగులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. నిధులను విడుదల చేయకపోవడంతో అప్పట్లో ఎవరికి కూడా సాయం అందలేదు. జిల్లాలో 35 మందికే రాయితీ రుణాలను అందించడానికి గత ప్రభుత్వం నిధులను కేటాయించింది. అప్పట్లో రూ. 23.20 లక్షలను రాయితీ కింద విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సారి మాత్రం రూ.20 లక్షలను కేటాయించారు. ఇందులో 32 మందికి రూ.50 వేల చొప్పున వందశాతం రాయితీ కింద అందించాలని పేర్కొన్నారు. ఒకరికి రూ.లక్ష బ్యాంకు లింకేజీ రుణం ఇప్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇందులో రూ.80 వేలను రాయితీగా కేటాయించనున్నారు. రూ.10 లక్షల వరకు ఒక యూ నిట్‌ను కేటాయించగా ఇందులో రూ.ఐదు లక్షల రాయితీ అందించనున్నారు. జిల్లాలో దివ్యాంగుల సంఖ్య వేలల్లో ఉండగా రాయితీ రుణాలను మాత్రం ప్రభుత్వం అరకొరగానే అందిస్తుంది.

నిధులను విడుదల చేశారు

గతేడాది అందించాల్సిన రాయితీ రుణాలను ఇప్పుడు అందించనున్నాం. అప్పట్లో నిధుల కేటాయింపు సరిగా జరగలేదు. గతంలో కొంత మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశాం. ఇటీవల మరోసారి దరఖాస్తులను స్వీకరించాం. గతంలో ఎంపికైన వారికి ప్రాధాన్యత ఇచ్చి రాయితీ రుణాలను అందిస్తాం.

– రసూల్ బీ, జిల్లా వికలాంగుల సంక్షేమాధికారి

పల్స్ పోలియో విజయవంతం



కేకే తండాలో వాహనదారులను ఆపి పిల్లలకు చుక్కల మందు వేస్తున్న సిబ్బంది



పోతంగల్‌లో ఆర్టీసీ బస్సులో..

- 95 శాతం చిన్నారులకు చుక్కల మందు వేసిన సిబ్బంది

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో విజయవంతం అయింది. జిల్లావ్యాప్తంగా 95శాతం చిన్నారులకు చుక్కల మందు వేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పల్స్ పోలియో నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొని పిల్లలకు చుక్కల మందులు వేశారు. జిల్లాలో 1,91,081 టార్గెట్‌కు గాను 1,81,781మంది పిల్లలకు చుక్కల మందు వేశారు. సోమ, మంగళవారాల్లో సైతం పల్స్ పోలియో కార్యక్రమం ఇంటింటికి జరుగుతుందని డీఎంహెచ్‌వో సుదర్శనం తెలిపారు. జిల్లాలో అత్యధికంగా వేల్పూర్ పీహెచ్‌సీ పరిధిలో 99.31శాతం నమోదైంది. అత్యల్పంగా ఎడపల్లి పీహెచ్‌సీలో 91.15శాతం నమోదైంది. అర్బన్‌లో అత్యధికంగా గౌతంనగర్ యుపీహెచ్‌సీలో 97.73శాతం, అత్యల్పంగా పాంగ్రాలో 70.31శాతం నమోదైంది.

ధర్మోరా లిఫ్ట్ పనుల పరిశీలన

మాక్లూర్: మండలంలోని బొంకన్‌పల్లి, ముల్లంగి (బి)కి సాగు నీటికోసం ధర్మోరా చెరువు వద్ద కొనసాగుతున్న మినీ లిఫ్ట్ పనులను ఆదివారం జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పరిశీలించారు. 90 శాతం పనులు పూర్తయినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. మిగతా పనులను వేగంగా పూర్తి చేసి జూన్ నాటికి పూర్తయ్యేలా చూడాలని జెడ్పీ చైర్మన్ ఆదేశించారు.



పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

సారంగాపూర్ ఫ్యాక్టరీ తెరుచుకునేనా!

- శిథిలావస్థకు చేరుకుంటున్న చక్కెర కర్మాగారం
- పునరుద్ధరించాలని కోరుతున్న రైతులు, కార్మికులు

నిజామాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధణకు కమిటీ వేయడంతో సారంగాపూర్ ఫ్యాక్టరీని కూడా తెరిపించాలని రైతులు, కార్మికులు కోరుతున్నారు. 1963లో ప్రారంభమైన ఈ ఫ్యాక్టరీ చెరుకు రైతులకు వరప్రదాయినిగా ఉండేది. ఫ్యాక్టరీలో రోజుకు 1250 క్వింటాళ్ల చక్కెర ఉత్పత్తి జరిగేది. 1999 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని షుగర్ ఫ్యాక్టరీలను ప్రైవేటీకరించగా రైతులు కోర్టుకు వెళ్లి సారంగాపూర్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను అడ్డుకున్నారు. 2008 వరకు సాఫీగా సాగిన ఫ్యాక్టరీ తర్వాత మూతపడింది. అప్పటి నుంచి కార్మిక నాయకులు, రైతులు ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని కోరుతూనే ఉన్నారు. నాయకులు హామీలు ఇస్తున్నా అమలు మాత్రం కావడం లేదు. గతంలో అప్పటి రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి సారంగాపూర్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి పునః ప్రారంభిస్తామని మాట ఇచ్చారు. ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ నాయకులు అప్పటి మంత్రి కేటీఆర్‌ను కలిసి విన్నవించారు. నెల రోజుల్లో తెరిపిస్తామని ఆయన మాటిచ్చారని.. కానీ అది అమలు కాలేదని కర్మాగారం పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కొండెల సాయిరెడ్డి తెలిపారు.



ఐదు వందల మందికి ఉపాధి

సారంగాపూర్ షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తే ఐదు వందల మందికి ప్రత్యక్షంగా మరో 500 మందికి పరోక్షంగా ఉపాధి కలుగుతుంది. అలాగే ఐదు వేల మంది చెరకు రైతులకు లబ్ధి చేకూరుతుందని ఫ్యాక్టరీ నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఫ్యాక్టరీ మూతబడటంతో అందులో పని చేసిన వారిలో కొందరు చనిపోయారు. మరి కొందరు క్వార్టర్స్‌లో ఉంటూ ఇతర పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. సారంగాపూర్ చక్కెర కర్మాగారంలో ప్రస్తుతం 18 మంది మాత్రమే పని చేస్తున్నారు. వారికి కూడా 74 నెలల నుంచి జీతాలు లేవు. రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసి వారు జీతాల కోసం విన్నవించారు. దీంతో ఫ్యాక్టరీ గోదాముల్లో ధాన్యం నిల్వ చేయడానికి అనుమతించి ఆ డబ్బుతో నెలకు రూ.ఆరు వేలు చొప్పున జీతాలు ఇస్తున్నారు. గతంలో ఎంతో మందికి ఉపాధి కల్పించిన ఫ్యాక్టరీ ప్రస్తుతం అడవిని తలపిస్తోంది.

మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి

ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుకు ఏఐకేఎంఎస్, భారతీయ రైతు కూలీ సంఘం నాయకులు సారంగాపూర్ చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించాలని వినతిపత్రం అందజేశారు. విజయ సంకల్పయాత్రలో భాగంగా అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తా ఇటీవల సారంగాపూర్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఫ్యాక్టరీని తెరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

రైతులకు అప్పగించాలి



సారంగాపూర్ చక్కెర కర్మగారాన్ని పునఃప్రారంభించాలి. లేకపోతే రైతులకు అప్పగించాలి. ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ఫ్యాక్టరీ పరిధిలోని 130 గ్రామాల ప్రజలతో సమావేశమై పోరాటం చేస్తాం.

– సాయిరెడ్డి, ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు

చెరుకు రైతులకు న్యాయం చేయాలి



చక్కెర కర్మాగారాన్ని ప్రభుత్వం ప్రారంభించి చెరుకు రైతులకు న్యాయం చేయాలి. ఫ్యాక్టరీ నడవకపోవడంతో రోడ్డున పడ్డ కుటుంబాలను ఆదుకోవాలి.

– రాజశేఖర్, సెక్యూరిటీ ఆఫీసర్

తైక్వాండోతో ఆత్మరక్షణ

- న్యాయసేవాధికార సంస్థ రాష్ట్ర సభ్య కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి
- నగరంలో 11 వేల మందితో తైక్వాండో ప్రదర్శన
- ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

ఖలీల్‌వాడి: బాలికలు, మహిళల ఆత్మరక్షణకు తైక్వాండో దోహదపడుతుందని న్యాయసేవాధికార సంస్థ రాష్ట్ర సభ్య కార్యదర్శి, హైకోర్టు జడ్జి గోవర్ధన్ రెడ్డి అన్నారు. నగరంలోని గిరిరాజ్ కాలేజీ మైదానంలో ఆదివారం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 11 వేల మంది బాలికలు, మహిళలతో తైక్వాండో శిక్షణ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కించుకుంది. ఈ కార్యక్రమానికి హాజరైన జడ్జి గోవర్ధన్ రెడ్డి మాట్లాడారు. తైక్వాండో నేర్చుకున్న బాలికలు మిగతా వారికి ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు. 11 వేల మందితో ప్రదర్శన నిర్వహించడం అభినందనీయం అన్నారు. మార్చి 8న నిర్వహించుకునే మహిళా దినోత్సవానికి ఈ ప్రదర్శన చిరస్మరణీయ చిహ్నంగా నిలుస్తుందన్నారు. ఇంతపెద్ద శిక్షణ కార్యక్రమం నిర్వహించడం న్యాయసేవా సంస్థకు గర్వకారణమన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవా అధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల మాట్లాడుతూ బాలికల ఆత్మరక్షణ కోసం తైక్వాండో ప్రధాన భూమిక పోషిస్తుందని తెలిపారు. ఈ ప్రదర్శనకు జిల్లాలోని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం సహకారం మరిచిపోలేనిదన్నారు. ఆత్మరక్షణతో ఆత్మగౌరవం పెరుగుతుందని నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ పేర్కొన్నారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ హైదరాబాద్ కార్యాలయ ప్రతినిధి వసుధ అశోక్ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించి రికార్డ్ పత్రాన్ని హైకోర్టు జడ్జి గోవర్ధన్ రెడ్డి, జిల్లా జడ్జి సునీతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్‌రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జీలు శ్రీకాంత్ బాబు, అజయ్ కుమార్, పద్మావతి, జూనియర్ సివిల్ జడ్జీలు కుష్బు, గోపీ కృష్ణ, దీప్తి వేముల, పూజిత, సాయిశివ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, డీఈవో దుర్గాప్రసాద్, ఏసీపీ రాజా వెంకటరెడ్డి, తైక్వాండో మాస్టర్ మనోజ్ పాల్గొన్నారు.



నగరంలోని గిరిరాజ్ కాలేజీ మైదానంలో తైక్వాండో ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి గోవర్ధన్‌రెడ్డి

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి విజయకాంత్‌రావు తెలిపారు. కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లో ఆదివారం జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. వీరు ఈ నెల 9, 10వ తేదీల్లో మెదక్ జిల్లా రామాయంపేటలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పోటీలకు ఎంపికైన వారిలో శిల్పాచౌహాన్, మేఘన, అన్‌మోల్, రోహిత్, గంగాధర్, మనీశ్, నిహాల్, శివచరణ్, శబరీష్ ఉన్నారు. ఇందులో ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాకేశ్‌కుమార్, సభ్యులుగా నరేశ్‌కుమార్, వినోద్, యెండల రాం, జట్టుకు కోచ్‌గా రాగుల నరేశ్‌కుమార్, మేనేజర్లుగా గడ్డం రవి వ్యవహరించనున్నారు.

మిత్రుడి కూతురు వివాహానికి ఆర్థికసాయం



బోధన్‌రూరల్: నిరుపేదకు చెందిన మిత్రుడి కూతురు వివాహానికి చిన్ననాటి మిత్రులు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. మండలంలోని అమ్దాపూర్‌కు చెందిన పర్వయ్య తన కూతురు శిరీష వివాహానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రహించిన 1984–85 పదో తరగతి చిన్ననాటి స్నేహితులు రూ. 78,800 నగదుతో పాటు బియ్యం అందజేశారు. ఆపద కాలంలో అండగా నిలిచిన తన స్నేహితులకు పర్వయ్య కళావతి దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జాల కిషన్, ముక్క శ్రీనివాస్, దాసరి వెంకటేశ్, కేతావత్ బిల్లు సింగ్, త్రినాధం, సల్ల రాజేశ్వర్ రెడ్డి, గాండ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు ఆందోళన చెందొద్దు

రాజంపేట: గృహజ్యోతి పథకంపై మండల విద్యుత్ వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందవద్దని మండల విద్యుత్ ఏఈ మారుతి అన్నారు. ఈనెలలో కొంతమంది గృహ వినియోగదారులకు జీరో బిల్లు వచ్చిందని, మరి కొంతమందిని అప్లోడ్ సరిగా లేని కారణంగా లేదా ఇతర కారణాల కారణంగా బిల్లులు వచ్చాయన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి అర్హత కలిగిన వినియోగదారులు తిరిగి తమ ఆధార్ కార్డు, ప్రజాపాలన దరఖాస్తు రశీదు, ప్రస్తుత నెల కరెంటు బిల్లు రసీదు తీసుకొని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌లో ఇవ్వాలన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ఎడపల్లి: జానకంపేట్ శివారులోని నిజాంసాగర్ డి 50/1 కాలువ నుంచి ఉపకాలువ గుండా సాగునీరు వెళ్లకుండా కొందరు ఇసుక బస్తాలు, బండరాళ్లు వేస్తున్నారని వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. రాత్రివేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు పోచారం శివారులో ఉన్న పొలాలకు నీరు వెళ్లకుండా అడ్డుకట్ట వేసినట్లు ఇరిగేషన్ అధికారులకు బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో రైతులే బండరాళ్లు, ఇసుక బస్తాలను తొలగించారు. నీరు రాకుండా చేసిన వారిని అధికారులు గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

‘బైపాస్’తో రైతుల్లో అలజడి

- జాతీయ రహదారి విస్తరణలో బైపాస్‌రోడ్డు నిర్మాణానికి కసరత్తు
- సుమారు 70 ఎకరాల భూమికి నష్టం
- పాతరోడ్డునే విస్తరించాలంటున్న రైతులు



బైపాస్‌రోడ్డు నిర్మాణంలో కోల్పోనున్న భూములు

వేల్పూర్: మండలంలో చేపట్టనున్న బైపాస్‌రోడ్డు నిర్మాణంపై బాధిత రైతుల్లో అలజడి నెలకొంది. జాతీయ రహదారి విస్తరణలో వ్యవసాయ సాగు భూమి పోతే ఎలా బతికేది అంటూ ఆందోళన చెందుతున్నారు. వేల్పూర్ మండలంలోని లక్కోర, పడగల్ ఒడ్డెర కాలనీ, అంక్సాపూర్, కుకునూర్ గ్రామాల మీదుగా పెర్కిట్ నుంచి మంచిర్యాల వరకు 63వ నంబర్ జాతీయ రహదారిని విస్తరించనున్నారు. రోడ్డు విస్తరణకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి లైన్ క్లియర్ చేసింది.

ఈ గ్రామాల మధ్య ఉన్న రహదారిని విస్తరిస్తే గృహాలకు నష్టం వాటిల్లుతుందని, బైపాస్‌రోడ్డు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. బైపాస్ రోడ్డు నిర్మించాలంటే సుమారు 70 ఎకరాల వ్యవసాయభూమి అవసరమని అధికారులు నిర్ధారించారు. ఇందులో పడగల్ ఒడ్డెర కాలనీ, అంక్సాపూర్, కుకునూర్ గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు. ఇందులో ఎకరం, రెండు ఎకరాల భూములు కలిగి దానినే జీవనాధారంగా జీవిస్తున్న సన్న, చిన్నకారు రైతులు చాలా మంది ఉన్నారు. తమ భూములు బైపాస్‌రోడ్డు నిర్మాణానికి తీసుకుంటే జీవనాధారం కోల్పోతామని ఆందోళన చెందుతున్నారు. రహదారి విస్తరణలో ఇల్లు కోల్పోతే తిరిగి నిర్మించుకోవచ్చని, అదే భూమి కోల్పోతే ఎలా బతికేది అంటూ ఆవేదన చెందుతున్నారు. బైపాస్‌రోడ్డు వద్దని, ప్రస్తుతం ఉన్న రహదారినే విస్తరించాలని పడగల్ ఒడ్డెర కాలనీ, అంక్సాపూర్, కుకునూర్ జీపీలు తీర్మానించి హైవే అధికారులకు అందజేసినా వారు ఎలాంటి హామీ ఇవ్వడం లేదంటున్నారు.

గతంలోనూ రైల్వే లైను నిర్మాణానికి..

గతంలో రైల్వే లైను నిర్మాణానికి భూములిచ్చి నష్టపోయాం, తిరిగి బైపాస్‌రోడ్డు నిర్మాణానికి కూడా భూములు కోల్పోవాల్సిందేనా అంటూ బాధిత రైతులు మదనపడుతున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం భూమి విలువ ఎకరానికి రూ. 50 లక్షలు ఉందని, ఇంత నష్టపరిహారం ప్రభుత్వం ఇస్తుందా? ఒకవేళ ఇచ్చినా తాము కొనుగోలు చేయడానికి ఇంతమంచి భూమి దొరుకుతుందా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రహదారిని రెండువైపులా 25 ఫీట్ల చొప్పున వెడల్పు చేయాలని వారు కోరుతున్నారు. రోడ్డు గుండా చేపట్టే నిర్మాణంలో తమ ఇళ్లస్థలాలు పోయినా ఫర్వాలేదు కానీ తమ జీవనాధారమైన వ్యవసాయ భూమిని కోల్పోతే తాము బతకలేమంటూ బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైల్వేలైనుకు రెండెకరాల భూమి..



మా గ్రామం మీదుగా రైల్వేలైను నిర్మించినప్పుడు నా రెండెకరాల భూమి పోయింది. తిరిగి ఇప్పుడు బైపాస్‌రోడ్డు నిర్మిస్తే మరో ఎకరం పోయే అవకాశం ఉంది. గ్రామం మీదుగా రోడ్డు నిర్మించినా, రోడ్డు పక్కనే ఉన్న నా ఇల్లు పోతుంది. ఇల్లు పోయినా సరే. భూమి మాత్రం ఉండాలి.

– నామాల గంగారెడ్డి, రైతు, అంక్సాపూర్

నష్టపోకుండా చూడాలి



జాతీయరహదారికి బైపాస్‌రోడ్డు వేసినా, గ్రామ మధ్య నుంచి వెడల్పు చేసినా నష్టపోతాం. ముందే రైల్వేలైను కోసం ఎకరంనర భూమిని కోల్పోయా. ఇలా రెండు విధాలుగా నష్టపోయేవాళ్లం గ్రామంలో పది మందిమి ఉన్నాం. అధికారులు తమకు ఆధారంగా ఉన్న భూములు నష్టపోకుండా చూడాలి.

– పోశపు సుధీర్, రైతు, అంక్సాపూర్

ప్రాణం పోయినా భూములివ్వం



మా కుటుంబానికి ఉన్నదే రెండెకరాల భూమి. అది కూడా బైపాస్‌రోడ్డులో పోతే ఏం చేసుకొని బతకాలి. పాతరోడ్డునే వెడల్పు చేయండి. ఎన్నో ఏళ్ల నుంచి భూమిని నమ్ముకొని జీవిస్తున్న చిన్న రైతులం. మా బాధను అధికారులు గుర్తించాలి. ప్రాణం పోయినా మా భూములు ఇవ్వం.

– మేకల నర్సు, పడగల్ ఒడ్డెరకాలనీ

అంగన్‌వాడీల్లో బయోమెట్రిక్!

– ఏర్పాటు చేయాలని ఆదేశించిన సీఎం

నిజామాబాద్ నాగారం: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశ పెట్టేందుకు చర్యలు చేపడుతోంది. దీనిపై రెండు, మూడు రోజుల్లో జిల్లాకు మార్గదర్శకాలు రానున్నాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 1500 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 420 అంగన్‌వాడీ సొంత భవనాలున్నాయి. మిగిలినవి అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయి. ఇవి అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్యాన్లు, లైట్ సౌకర్యాలు లేవు. వీటిల్లో చిన్నారులు 80,747, గర్భిణులు– 1134, బాలింతలు–10260 మంది ఉన్నారు. వీరికి పాలు, గుడ్లు, పౌష్టిహారాన్ని అంగన్‌వాడీ టీచర్ల ద్వారా అందిస్తున్నారు.

అక్రమాలకు చెక్..

జిల్లాలో ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి కసరత్తు జరుగుతోంది. అయితే ముందుగా విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంటుంది. బయోమెట్రిక్ హాజరు విధానంతో అక్రమాలకు చెక్ పడుతుంది. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో పాటు కేంద్రానికి వచ్చే పిల్లలు, బాలింతలు, గర్భిణులకు బయోమెట్రిక్ విధానం ఉంటుంది. బయోమెట్రిక్ హాజరుతో మెరుగైనా సంక్షేమ ఫలితాలు అర్హులకే లభిస్తుంది.

ఆదేశాలు రాగానే అమలు చేస్తాం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అమలు చేయడం చేస్తాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. బయోమెట్రిక్ విధానం బాగుంటుంది. సీసీ కెమెరాల ఏర్పాటుతో నిరంతర పర్యవేక్షణ ఆన్‌లైన్‌లో జరుగుతుంది.

– రసూల్ బీ, జిల్లా సంక్షేమశాఖ అధికారి

ఒకేసారి మూడు ఉద్యోగాలు



పల్లె కార్తీక్

నవీపేట్: మండలంలోని నాగేపూర్ గ్రామానికి చెందిన పల్లె కార్తీక్ ఏకకాలంలో మూడు ప్రభుత్వ ఉద్యోగా లు సాధించి ఆదర్శంగా నిలిచాడు. గ్రామానికి చెందిన పల్లె గంగారాం, దేవ్‌బాయిల కుమారుడు కార్తీక్ 2021 ఆగస్టులో అవుట్‌సోర్సింగ్ ద్వారా జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. గతేడాది నిర్వహించిన మూడు పరీక్షల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో ఉద్యోగాలు సాధించాడు.

నరేశ్‌కు రెండు..



నరేశ్

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని తుప్దాల్ గ్రామానికి చెందిన నరేశ్ ఇటీవల ప్రకటించిన లెక్చరర్ల ఉద్యోగ పరీక్షల్లో ఫిజిక్స్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించారు. అలాగే గురుకుల డిగ్రీ లెక్చరర్ ఉద్యోగం సాధించారు. జూనియర్ కళాశాల లెక్చరర్ ఉద్యోగ ఫలితాల్లో రాష్ట్రంలో ఫస్ట్ ర్యాంక్, గురుకుల డిగ్రీ లెక్చరర్ ఉద్యోగ ఫలితాలో రాష్ట్రస్థాయిలో ఏడవ ర్యాంక్ సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

బాన్సువాడ రూరల్: మండలంలోని బుడిమి గ్రామానికి చెందిన బేగంపేట రాములు బైక్‌పై ఆదివారం రాత్రి ఇంటికి వస్తుండగా గ్రామశివారులో రోడ్డుపై ఉన్న మట్టికుప్పను ఢీకొన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాములును 108 అంబులెన్స్‌లో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

ఎడపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కుర్నాపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై విక్రం ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శీలం రాజు(25) కూలీ పనులు చేస్తూ జీవిస్తుంటాడు. ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన రాజు ఆదివారం రాత్రి పొలం వద్దకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మృతుడి భార్య ప్రవళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్‌బీఐ రివార్డ్స్ పేరుతో సైబర్ మోసం

బాన్సువాడ రూరల్: ఎస్‌బీఐ రివార్డ్స్ పేరిట ఓ యువతి సైబర్ మోసానికి గురైనట్లు సీఐ కృష్ణ ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బాన్సువాడ మండలం చిన్న రాంపూర్‌తండాకు చెందిన విజయ తన ఫోన్‌లో ఫిబ్రవరి 23న వచ్చిన ఎస్‌బీఐ రివార్డ్ మెసేజ్ లింక్‌ను ఓపెన్ చేసింది. అందులో సైబర్ నేరగాళ్లు సూచించినట్లు ఓటీపీ ఎంటర్ చేయగానే బ్యాంక్ అకౌంట్ నుంచి రూ. 37వేలు విత్‌డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే అప్రమత్తమైన విజయ సైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి జరిగిన మోసాన్ని తెలిపి, పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



కామారెడ్డిలో పాల్గొన్న విద్యార్థులు



సమ్మేళనంలో పాల్గొన్న మదన్‌పల్లి పూర్వ విద్యార్థులు



పోచంపాడ్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మాక్లూర్ మండలంలోని మదన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003–04కు చెందిన పూర్వ విద్యార్థులు, బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ ఉన్నత పాఠశాలలో 1997–98, మెండోరా మండలం పోచంపాడ్ ఉన్నత పాఠశాలలో 2002–03, కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000, కామారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1973–74, భిక్కనూరులోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 2009–2010కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



భిక్కనూరులో..




ఉప్లూర్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ప్రకృతి సోయగం..

ఎత్తయిన తాటిచెట్ల న డుమ రైతులు సాగు చేస్తున్న పంటలు ప్రకృతి కి అందాలకు నిలువుటద్దంలా మారాయి. పై న నీలపు ఆకాశం, నేలపై రంగులు పరిచినట్లు గా ఎర్రజొన్న, వరి పైరు కనువిందు చేస్తున్నాయి. ఈ చిత్రాన్ని డొంకేశ్వర్–అన్నారం గ్రా మాల నడుమ ‘సాక్షి’ తన కెమెరాలో తీసింది.

–డొంకేశ్వర్(ఆర్మూర్)



అక్బర్‌నగర్‌లో చిరుత సంచారం?



మేక కళేబరాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

రుద్రూర్: మండలంలోని అక్బర్‌నగర్ శివారులో చిరుత సంచరిస్తోందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. నెల రోజుల క్రితం సమీపంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రం పరిసర ప్రాంతాల్లో అడవి పంది మృతదేహం లభించగా ఫారెస్ట్ అధికారులు పరిశీలించి చిరుత దాడిగా నిర్ధారించారు. ఆ ప్రాంతానికి ఒంటరిగా వెళ్లొద్దని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే పటాకులు కాలుస్తూ గుంపులుగా వెళ్లాలని సూచించారు. తాజాగా శనివారం రాత్రి గ్రామంలోని ప్రధాన రోడ్డుపై మేక మృతితో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. షేక్ బిలాల్‌కు చెందిన మేకల షెడ్డుపై చిరుత దాడి చేసి మేకను ఎత్తుకొచ్చి రోడ్డుపై చంపేసి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం గ్రామ ప్రత్యేకాధికారి సంతోష్‌రెడ్డి, జీపీ కార్యదర్శి గంగారాం ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. గ్రామ శివారులో చిరుతను బంధించేందుకు బోను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేలుడు ఘటనలో మహిళకు తీవ్ర గాయాలు

- అన్నారంలో గుర్తు తెలియని పదార్థం పేలిందన్న పోలీసులు

రామారెడ్డి: మండలంలోని అన్నారంలో పేలుడు సంభవించి ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కొండ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దండగుల రవీందర్ ఇంట్లో అకస్మాతుగా గుర్తు తెలియని పదార్థం వచ్చి పేలడంతో రవీందర్ భార్య శిరీష కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టగా ఇంట్లోకి అకస్మాతుగా గుర్తు తెలియని పదార్థం వచ్చి పేలినట్లు తెలిపారు. శిరీషను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కామారెడ్డికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేట కోసమేనా..

గతేడాది సింగరాయపల్లి అడవిలో రెడ్డిపేట గ్రామానికి చెందిన రాజు జంతువుల వేట కోసం వెళ్లి గుండ్ల మధ్య చిక్కుకున్న ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ పేలుడు ఘటన కూడా అటవీ పందుల వేట కోసం తెచ్చిన పేలుడు పదార్థమేనా లేదా బండరాళ్లను పేల్చడానికే తెచ్చిందా అనే కోణంలో విచారణ చేయాల్సి ఉంది. గ్రామంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో జరగడంతో గ్రామస్తులు భయాందోళనకు గురాయ్యరు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి

లింగంపేట: పంచాయతీ ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని నల్లమడుగు పెద్దతండాలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన దానావత్ శ్రీనివాస్ (30) జీపీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జీపీ ట్రాక్టర్ ట్యాంకర్‌లో నీటిని తరలిస్తుండగా పంట చేను నుంచి రోడ్డుపైకి ఎక్కే క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ట్యాంకరుతో పాటు ఇంజన్ తలకిందులు కావడంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుంటలో పడి యువకుడు..

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్ చెరువు సమీపంలో ఉన్న నీటి కుంటలో పడి యువకుడు మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్ ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బబ్లూ(26) తో పాటు మరో ముగ్గురు జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో అద్దెకు ఉంటూ పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు ఉదయం చేపలు పట్టేందుకు న్యాల్‌కల్ చెరువు వద్ద ఉన్న నీటి కుంటలోకి దిగారు. అప్పటికే వారు మద్యం మత్తులో ఉన్నారు. బబ్లూకు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. విషయం గమనించిన మిగతా వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి మరొకరు..

భీమ్‌గల్: బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై హరిబాబు ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జాగిర్యాల గ్రామానికి చెందిన కోనపత్రి లింబాద్రి(53) పెర్కిట్ నుంచి శనివారం అర్ధరాత్రి జాగిర్యాల్‌కు వస్తుండగా సుదర్శనగర్ తండా సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు ఢీకొని గొర్రెల కాపరి..

భిక్కనూరు: మండల సమీపంలో రైలు ఢీకొని గొర్రెల కాపరి మృతిచెందినట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. భిక్కనూరుకు చెందిన కోరె బీరయ్య(40) గొర్రెల కాపరిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం రెండు గొర్రె పిల్లలు తప్పిపోవడంతో వాటికి వెతికేందుకు వెళ్లగా రైలు ఢీకొన్నదన్నారు. ఈ ఘటనలో బీరయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రుద్రూర్: కోటగిరి పీఎస్ పరిధిలో అనుమతి లేకుండా మంజీరా నది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోతంగల్ శివారులో పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ ఆదివారం తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి సంబంధిత అధికారులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా మొరం, ఇసుక తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

క్రైం కార్నర్

మద్యం మత్తులో భార్యను చంపిన భర్త



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లేశ్

జక్రాన్‌పల్లి: మద్యం మత్తులో భార్యను చంపిన ఘటన మండలంలోని నూర్‌సింగ్ తండాలో చోటు చేసుకుంది. మండలంలోని పీఎస్‌లో ఆదివారం డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై తిరుపతి నిందితుడి వివరాలు వెల్లడించారు. తండాకు చెందిన కేలోత్ సరిత(35)కు ఇరవై ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన కేలోత్ శ్రీనివాస్ అలియాస్ సుధాకర్‌తో వివాహమైంది. శ్రీనివాస్ మద్యానికి బానిసై తరచూ సరితను కొడుతూ చిత్రహింసలకు గురిచేసేవాడు. ఈ నెల 1న మధ్యాహ్నం బయటి నుంచి వచ్చిన శ్రీనివాస్ ఇంట్లో ఉన్న సరితతో గొడవ పడ్డాడు. సరిత ముఖంపై పిడిగుద్దులు గుద్ది గొడ్డలితో తలపై, పలుచోట్ల దాడి చేశాడు. దీంతో సరిత అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనలో మొదట అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి హత్యగా గుర్తించారు. విచారణలో భర్త శ్రీనివాస్‌ను తమదైన శైలిలో విచారణ చేపట్టగా తానే హత్య చేసినట్లు నిందితుడు శ్రీనివాస్ ఒప్పుకున్నట్లు తెలిపారు. దీంతో నిందితుడు శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్సై పేర్కొన్నారు.

బెల్టు షాపుపై దాడి



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

లింగంపేట: మండలంలోని మోతెలో బెల్టు షాపుపై దాడి చేసినట్లు ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి ఆదివారం తెలిపారు. గ్రామంలో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి రూ. లక్ష విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. బెల్టు షాపు నిర్వాహకుడు ప్రతాప్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో సిబ్బంది పాల్గొన్నారు.

కారును ఢీకొన్న బైక్



ఘటన స్థలంలో కారు, బైక్

సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు చౌరస్తా వద్ద కారును బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలైనట్లు ఎస్సై రమేశ్ ఆదివారం తెలిపారు. భీంగల్‌కు చెందిన జంగం నవీన్ తన కుటుంబీకులతో కలిసి కారులో గడ్కోల్ బంధువులకు వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా కొండాపూర్ గ్రామానికి చెందిన దండుగుల సాయిలు బైక్‌పై రాంగ్ రూట్‌లో వచ్చి కారును ఢీకొన్నాడు. ఈ ఘటనలో కారు నడుపుతున్న నవీన్ కుడి చేతికి తీవ్రగాయమైనట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.